క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని మాదిగ చైతన్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ పోచమ్మ తల్లి ఆలయ అష్టమ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు విఠాల రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖర శర్మల నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ, పుష్పార్చన, కుంకుమార్చన, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి సామూహిక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటుకు డిమాండ్



బెజ్జంకిలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఎస్సీ ఉప కులాల కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్సీ 57 ఉపకులాల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దర్శనం భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. బెజ్జంకిలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దళితుల్లో వెనుకబడిన ఉపకులాలకు ఈ కార్పొరేషన్‌తో న్యాయం జరుగుతుందన్నారు. ఉప కులాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న భైరి వెంకటేశంను చైర్మన్‌గా నియమించాలని కోరారు. సమావేశంలో మహిళా నాయకులు యాదమ్మ, ఇందిరా, ప్రేమలత, ప్రమీల, రజిత, భూదవ్వ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రువాండా వర్సిటీ పరీక్షల ఎగ్జామినర్‌గా సిద్దిపేట వైద్యుడు



దక్షిణాఫ్రికాలో డెంటల్ పరీక్షల నిర్వహణలో డాక్టర్ అరవింద్

సిద్దిపేట జోన్: దక్షిణాఫ్రికా స్కూల్ ఆఫ్ డెంటిస్ట్ కాలేజ్ ఆఫ్ యూనివర్సిటీ రువాండా పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యమయ్యే అవకాశం రావడం సంతోషంగా ఉందని సిద్దిపేట దంత వైద్యుడు అరవింద్ పేర్కొన్నారు. ఈనెల 13నుంచి 18 వరకు యూనివర్సిటీ దంత పరీక్షల ఎగ్జామినర్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. అలాగే దక్షిణాఫ్రికాలో క్లినికల్, ల్యాబ్స్ నిర్వహణలో పాల్గొన్నట్లు తెలిపారు.

పోస్టర్ పెయింటిగ్‌లో ప్రథమ బహుమతి



భావనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాక: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీలలో జిల్లాస్థాయిలో ధర్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ టెన్త్ విద్యార్థిని జి.భావన ప్రతిభ చూపింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పోస్టర్ పెయింటింగ్ పోటీలో ప్రథమ బహుమతి అందుకుంది. జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మంజుల, క్వాలిటీ కోఆర్డినేటర్ భాస్కర్ బహుమతి అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి పాఠశాలకు పేరు తెచ్చిన భావన, గైడ్ టీచర్ నరేష్‌ను హెచ్‌ఎం శ్రీనివాస్, ఎంఈఓ ప్రభు దాస్, పూర్ణచందర్, పవన్‌తో పాటు పలువురు అభినందించారు.

మార్కెట్ యార్డు సందర్శన

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోఉన్న మార్కెట్ యార్డులను బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. మార్కెట్ యార్డుల్లో నెలకొన్న సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు సంఘం కరుణాకర్, అసెంబ్లీ కన్వీనర్ బండారు మహేష్, సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ లంబ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు

- 21న స్వామి వారి తిరుకల్యాణం
- 25 వరకు ఉత్సవాలు



వరద రాజస్వామి దేవాలయం



ఉత్సవ విగ్రహాలు

మర్కూక్(గజ్వేల్): రెండో కంచిగా పేరుగాంచిన శ్రీ వరదరాజస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపేందుకు ఆలయ నిర్వాహకులు, గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి 25 వరకు జరుగుతాయి. మర్కూక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామంలోని శ్రీ వరదరాజస్వామి ఆలయానికి సుమారు 400 సంవత్సరాల చరిత్ర ఉంది.

ఉత్సవాల్లో ముఖ్య కార్యక్రమాలు

21వ తేదీన అశ్వవాహనంపై వచ్చే భూవికా సమేత వరదరాజస్వామి వారికి ఎదుర్కోలు, కల్యాణం, హంస వాహన సేవ, 22న సాముహిక సత్యనారాయణ వ్రతాలు, శేషవాహన సేవ, వీర హనుమాన్ భక్త బృందం భజన కార్యక్రమాలు, 23న కంచి గరుడసేవ, పండిత సన్మానం. 24న విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, హరికథా కాలక్షేపం, తీర్థ ప్రసాద వితరణ, 25న స్వామివారి దివ్యమాన రథోత్సవం, పూర్ణాహుతి, రాత్రి దీపోత్సవముతో పాటు 27 వరకు విశేష పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అలాగే పరిసర గ్రామాలైన ఎర్రవల్లి, ఇటిక్యాల, పీర్లపల్లి, ధర్మారం, శ్రీనివాసపురం, కాశిరెడ్డిపల్లి, మర్కూక్, దామరకుంట, పాములపర్తి, నర్సన్నపేట, గంగాపూర్-యూసుఫఖాన్‌పల్లి, శివారు వెంకటాపూర్, చేబర్తి, తదితరల గ్రామాల ప్రజలు స్వామివారి దర్శనానికి ఎడ్ల బండ్లపై వస్తారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

- గత ఏడాది వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలు
- ప్రస్తుత వర్షాలకు వరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయన్న సభ్యులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి
- ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పుష్పలత

దుబ్బాకరూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కొత్త పుష్పలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2023 యాసంగి సీజన్‌లో వడగళ్ల వర్షం కురిసి పంటలు నష్ట పోయిన రైతులకు ఇంత వరకు నష్ట పరిహారం చెల్లించలేదని పలువురు ఎంపీటీసీలు సభలో ప్రస్తావించారు. ఏడాదిగడిచినా పరిహారం చెల్లించక పోవడం బాధకరమన్నారు. గతంలో సిద్దిపేట ప్రాంతంలో పంటలు నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించారని, దుబ్బాక ప్రాంతంలో పంటలు నష్టపోయిన వారికి ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. వడగళ్ల వర్షం కురిసి పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు, మామిడి తోటలు దెబ్బతిన్నాయన్నారు. పంటలు నష్ట పోయిన రైతులను గుర్తించి నష్ట పరిహారం చెల్లించాలన్నారు. తిమ్మాపూర్, హబ్సిపూర్, చిట్టాపూర్ గ్రామాల మీదుగా జాతీయ రహదారి పనులు నత్తనడకన నడుస్తున్నాయని సభ దృష్టికి తెచ్చారు. కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీళ్లు నిలిచి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని చిట్టాపూర్ ఎంపీటీసీ కనకయ్య అధికారుల దృష్టికి తెచ్చారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జి శంకర్

సాక్షి ఎఫెక్ట్

హుస్నాబాద్‌రూరల్: 'సాగుకు సలహాలు ఏవీ' శీర్షికన బుధవారం సాక్షిలో వచ్చిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. శుక్రవారం పోతారం (ఎస్) గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయిల్ ఫెడ్ ఇన్‌చార్జి శంకర్ మాట్లాడుతూ రైతులు తక్కువ నీటి వనరులను ఉపయోగించి ఆయిల్ పామ్ సాగు చేయొచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై మొక్కలను అందిండంతోపాటు నీటి తడులు కోసం డ్రిప్ పరికరాలను అందించనున్నట్లు చెప్పారు. సాగులో అంతర పంటలను కూడా సాగు చేసుకుంటూ ఆదాయం పొందొచ్చని సూచించారు. ఏటా ఎకరాకు రూ. 4,100 నిర్వహణ ఖర్చుల కింద ఇస్తున్నామని, ఆసక్తిగల రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ముందుకు రావాలన్నారు. నంగునూర్ మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రం సిద్ధమవుతోందని చెప్పారు. ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ గింజలు తీసే సమయానికి కొనుగోలు కేంద్రం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు విజయ్, రవళి, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల పక్షపాతి

పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్



మాట్లాడుతున్న అనంతుల నరేందర్

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ పేదల పక్షపాతి అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధి వెలికట్ట క్రాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత నేత వైయస్సార్ హయాం నుంచి కాంగ్రెస్ పేదలను దృష్టిలో పెట్టుకొని పథకాలను అమలు చేస్తోందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రూ.లక్ష రుణమాఫీని చేయడం చేతకాని బీఆర్‌ఎస్ నాయకులు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై రుణ మాఫీపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందంటూ గగ్గోలు పెట్టడం శోచనీయమన్నారు. బీఆర్‌ఎస్ తీరులను గమనిస్తున్నారన్నారు.

కొనుగోలు నిర్ణయంపై హర్షం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

సిద్దిపేట కమాన్: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతులందరికీ రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తారని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సీఎం చూసుకుంటారన్నారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

అధిక రక్తపోటుపై సమీక్ష

సిద్దిపేటఅర్బన్: ప్రపంచ అధిక రక్తపోటు దినం సందర్భంగా మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాల అనుబంధ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో శుక్రవారం అధిక రక్తపోటు మాసం ప్రణాళిక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాంప్రసాద్ అధిక రక్తపోటు మాసం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై డాక్టర్లు, సిబ్బందితో చర్చించారు. అధిక రక్తపోటు రోగులకు ఉచిత వైద్య సలహాలు, రక్త పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మేజర్ గ్రామపంచాయతీలు, మండల కేంద్రాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. ఒకరోజు సిద్దిపేట పాత బస్టాండ్ నుంచి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపీచంద్, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణ ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ కరుణాకర్, ఆర్ఎంఓ డాక్టర్ జలపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



లింగుపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని లింగుపల్లి లో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించే సమయంలో కురిసిన వర్షాలకు తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. తెలంగాణ రైతాంగానికి ఇచ్చిన హామీలను రేవంత్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని అసహనం వ్యక్తం చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర, ప్రతీ రైతుకు రూ.500 బోనస్ ఇస్తానన్న హామీకి నేటికి కార్యాచరణ చేపట్టలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆంక్షలు పెట్టకుండా కొనుగోలు చేయాలి

సిద్దిపేటరూరల్: వర్షాలకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసిపోతోందని, ఆంక్షలు పెట్టకుండా కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణరావుపేట మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటవెంటవెంటనే కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోతారన్నారు. అధికారులు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇస్తున్నారే తప్ప వాటిని పట్టించుకోవడం లేదన్నారు. నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, కొర్రీలు పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్ గౌడ్, గ్రామ అధ్యక్షుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



రేగొండలో డెంగీ అవగాహన ర్యాలీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రేగొండ గ్రామంలో హెల్త్ అసిస్టెంట్ అధికారి కొమురయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం తప్పనిసరిగా నీటి తొట్లను శుభ్రం చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది,పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది మొసలి కన్నీరు



మాట్లాడుతున్న అందె రాజిరెడ్డి

దుబ్బాక టౌన్: రైతులపై బీఆర్‌ఎస్ పార్టీ మొసలి కన్నీరు కారుస్తోందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అందె రాజిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం దుబ్బాక కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరం అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించని బీఆర్‌ఎస్ సర్కార్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించి హక్కు లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు నెరవేర్చిందన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని మహమ్మాయిదేవి ఆలయంలో పట్టణ విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో జగద్గురువు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు మద్దూరు తిరుపతి అయ్యగారి ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం సభ్యులు దేవతా మూర్తులకు పంచామృత అభిషేకం, యజ్ఞం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమాల్లో సంఘం గౌరవ అధ్యక్షుడు నారాయణాచారి, అధ్యక్షుడు ఆంజనేయులుచారి, ప్రధాన కార్యదర్శి నర్సింహులుచారి, కోశాధికారి కాసుల చిన్న శ్రీనివాస్, నాయకులు మల్లేశం, శ్రీహరి, కృష్ణమూర్తి, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతోనే ఆరోగ్య భారతం

శిరిడీ సాయిబాబా ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న గండె శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆరోగ్యంగా ఉన్న చిన్నారులతోనే ఆరోగ్య భారతదేశం నిర్మితమవుతుందని శిరిడీ సాయిబాబా ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు గండె శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా శిక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉచిత యోగా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శిక్షణా తరగతులు జూన్ 10 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా గండె శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారులకు శిక్షణతో విద్యా వికాసం మెరుగవుతుందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఈ తరానికి దగ్గర చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వివరాలకు 63022 27030 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ టెక్నికల్ కార్యదర్శి, యోగా శిక్షకులు తోట సతీష్, తోట సంధ్య, మనీషా పాల్గొన్నారు.

వడ్ల గింజలతో వాసవీ కన్యకాపరమేశ్వరీ



వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతిని పురస్కరించుకుని గజ్వేల్‌కు చెందిన శ్రీరామ కోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ కోటి రామరాజు వడ్ల గింజలతో కన్యకాపరమేశ్వరీ చిత్రాన్ని రూ పొందించారు. ప్రజలకు కన్యకాపరమేశ్వరీ మాత ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

గజ్వేల్‌రూరల్:

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణాన్ని శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీఏ మహేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలు, ఎరువులను వాడాలన్నారు. 60 శాతం సబ్సిడీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీపై ఇచ్చే విత్తనాలను పొందేందుకు ఏఈఓ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించినా, కొనుగోలు చేసినా వారిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సబియా, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్ 'సీఈఐఆర్' టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గుర్జకుంట గ్రామానికి చెందిన వలబోజు నర్సింహాచారి తన సెల్‌ఫోన్ గత ఏడాది అక్టోబర్ 10వ తేదీన పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు 'సీఈఐఆర్' సాంకేతిక సాయంతో ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి అందజేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు 24 గంటలలోపు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ రాయితీలు ప్రకటించాలి

హుస్నాబాద్: సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్లకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పది రోజుల పాటు సినిమా థియేటర్లను మూసివేస్తున్నట్లు తెలంగాణ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేసన్ ప్రకటించిందన్నారు. ఓటీటీ, మల్టిప్లెక్స్ వచ్చిన తర్వాత సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పని చేస్తున్న కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం థియేటర్ల కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

◆ రైతులు ధైర్యంగా ఉండాలి

సిద్దిపేటజోన్: అకాల వర్షాలతో ధాన్యం తడిసిందని రైతులు అధైర్యపడొద్దని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం అన్నారు. శుక్రవారం ఆయన మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని అధికారులను కోరారు.

◆ పలువురి బైండోవర్

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగిన సంఘటనల్లో చేర్యాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ దామోదర్ శుక్రవారం తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో బీఆర్‌ఎస్‌కు చెందిన నిమ్మ రాజీవ్‌రెడ్డి, మంగోలు చంటి, అవుశర్ల కిషోర్, అవుశర్ల వెంకటేశ్, కాంగ్రెస్‌కు చెందిన దాసరి శ్రీకాంత్, బందెల మహిపాల్‌రెడ్డి, మామిడాల నాగరాజు, బోదాసు నాగేంద్రబాబు ఉన్నారు.

◆ మాజీ సర్పంచ్ మృతి



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ కొమ్మెర సురేందర్‌రెడ్డి (89) అనారోగ్యంతో శుక్రవారం హైదరా బాద్‌లో మృతి చెందారు. 1984 నుంచి 1989 వరకు సర్పంచ్‌గా ప్రజలకు సేవచేశారు. కుటుంబ సభ్యులు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సురేందర్ రెడ్డి మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

◆ పంట అవశేషాలను కాల్చొద్దు

కోహెడరూరల్(హుస్నాబాద్): వరి కోసిన తరువాత అవశేషాలను కాల్చొద్దని ఏఈఓ శివకుమార్ అన్నారు. మండలంలోని వరికోలు గ్రామంలో శుక్రవారం రైతులతో మాట్లాడారు. గడ్డిని కాల్చడం వలన సహజంగా వుండే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశిస్తాయన్నారు. పంట అవశేషాలను భూమిలో కలియదున్నితే కర్బన శాతం, సేంద్రియ పోషకాలు పెరుగుతాయన్నారు.

◆ పనులు త్వరగా చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీ, అమ్మ ఆదర్శ పాఠశాల పథకం పనులు త్వరగా పూర్తి చేయాలని మద్దూరు ఎంపీడీఓ రామ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం మద్దూరు మండల పరిధి ధర్మారం, మర్మాముల గ్రామ పంచాయతీ పరిధి బంజార గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో నిర్వహిస్తున్న పాఠశాల అభివృద్ధి పనులను ఈనెల చివరిలోగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ వెంట ఈసీ పరశురాం, టీఏ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శులు అశోక్, రేణుక, తదితరులు ఉన్నారు.

◆ బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



ములుగు(గజ్వేల్): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ములుగు ఎంపీపీ లావణ్య ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ములుగులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా కుల మతాలకతీతంగా ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు.